సాక్షి నల్లగొండ

బుధవారం ၊ 4 ၊ సెప్టెంబర్ ၊ 2024



రాకపోకల పునరుద్ధరణ

హైదరాబాద్ – విజయవాడ హైవేపై పాలేరు వంతెన పైనుంచి రాకపోకలను పునరుద్ధరించారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	585.90 అడుగులు
ఇన్‌ఫ్లో	2,39,236 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	1,99,342 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29,516 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	7,978 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	నిల్
ఏఎమ్మార్పీకి	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	642.20 అడుగులు
ఇన్‌ఫ్లో	6,227 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	1,244 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	నిల్
కుడికాల్వకు	నిల్

న్యూస్‌రీల్

802 ఎకరాల్లో పంటనష్టం

నల్లగొండ టౌన్ : మూడు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 802 ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దామరచర్ల, మాడుగులపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర, చందంపేట, శాలిగౌరారం, కేతేపల్లి, చండూరు మండలాల్లో వరి 648 ఎకరాల్లో, పత్తి 151 ఎకరాల్లో, మిర్చి 3 ఎకరాల్లో దెబ్బతిన్నదని.. మొత్తం 538 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు అంచనాలు వేసింది.

సీపీఎస్ ఉద్యోగుల ఒక్క రోజు వేతనం విరాళం

నల్లగొండ : వరద బాధితులకు ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పున్న సోమనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాల్లో కనీవినీ ఎరుగుని విధంగా వరద బీభత్సం సృష్టించిందని అందుకే సీపీఎస్ ఉద్యోగులంతా ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

కొటేషన్లు సమర్పించాలి

నల్లగొండ : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా పంచాయతీ ఓటరు జాబితాను సెట్ 1 (సుమారు 40000 పేజీలు) ప్రింట్ తీయడంతోపాటు 24 సెట్లు జిరాక్స్ తీసేందుకు ప్రింటర్లు, జిరాక్స్ సెంటర్ల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు పంచాయతీ అధికారి మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొటేషన్లను 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డీపీఓ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు1, హిందీ1, అర్థశాస్త్రం 1, పొలిటికల్ సైన్స్ 1, భౌతికశాస్త్రం 3, కంప్యూటర్‌సైన్స్ 1, జంతుశాస్త్రం 3, మైక్రోబయాలజీ 1 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈనెల 8వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, వివరాలకు సుదర్శన్‌రెడ్డి (99499 88926), నర్సింహ (98490 00244) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నల్లగొండ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం (2024–25) పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి కోటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండేళ్లలో మూడు గండ్లు

సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు ఇప్పట్లో అయ్యేనా?

- నీటి విడుదల బంద్ చేసినా కాల్వలో ఇంకా ప్రవాహం
- గతంలో ముప్పారం వద్ద గండి పూడ్చేందుకు 25 రోజుల సమయం
- ఇప్పుడు పనులు ప్రారంభించేదెప్పుడో.. పూర్తయ్యేదెన్నడో
- ఎడమకాల్వ కింద పంటలకు నెలరోజులు సాగునీరు బందేనా?



నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు పడిన గండి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు రెండేళ్లలో మూడు చోట్ల గండి పడింది. 2022లో నిడమనూరు మండలం ముప్పారం వద్ద గండి పడి వందల ఎకరాల్లో పంట నీట మునిగి, తీవ్ర నష్టం వాటిల్లగా ఇప్పుడు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రంగుల వంతెన వద్ద గండ్లు పడ్డాయి. ఒక్కో గండి దాదాపు 70 మీటర్ల వెడల్పులో పడటంతో వందల ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. అనేక చోట్ల పొలాల్లో ఇసుక మేటలు వేసి మళ్లీ నాట్లు వేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ప్రస్తుతం ఎడమకాలవ్వకు నీటి సరఫరా నిలిపివేశారు. అయితే కాలువలోని నీరు పూర్తిగా తగ్గలేదు. అది తగ్గితేనే మరమ్మతులు చేసే అవకాశం ఉంది.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం..

ఎడమకాల్వకు రెండుచోట్ల పడిన గండ్లను పూడ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. గండ్లను పరిశీలించిన సాగునీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పనులను చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో వారు ప్రతిపాదనలు సిద్ధంచేసే పనిలో నిమగ్నమయ్యారు.

నామినేషన్ పద్ధతిన పనులు

ఎడమకాల్వకు కాగిత రామచంద్రాపురం, రంగుల వంతెన వద్ద పడిన గండ్లను పూడ్చేందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతంలో నిడమనూరు మండలం ముప్పారం వద్ద పడిన గండిని పూడ్చేందుకే 25 రోజులకు పైగా సమయం పట్టింది. ఇప్పుడు దీనికి కూడా దాదాపు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రవాహం పూర్తిస్థాయిలో ఆగిపోయేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని, ఆ తరువాతే ఎలాంటి పనులైనా ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ పనులకు టెండర్లు పిలిచి ఇవ్వాలంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నందున నామినేషన్ పద్ధతిన చేపట్టే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

పంటలను కాపాడుకునేదెలా..

ఎడమకాల్వకు పడిన గండ్లను పూడ్చే పనులు నెల రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్న నేపథ్యంలో కాల్వ కింద సాగు చేసిన వరి, ఇతర పంటలను ఎలా కాపాడుకోవాలన్న దానిపై రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పుడైతే వర్షాలు పడుతున్నాయి.. కానీ మరో వారం గడిచాక వర్షాలు పడకపోతే పరిస్థితి ఏంటన్న దానిపై ఆందోళన చెందుతున్నారు. పంటలకు సాగునీరు ఎలా అన్న ఆలోచనల్లో పడ్డారు. వరి పంట పొట్టదశకు వచ్చే వరకు సాగునీరు అవసరమే. నెలరోజుల్లో పంట పొట్టదశకు చేరుకోనుంది. ఈ సమయంలో ఇలా గండి పడటం, అది పూడ్చే వరకు రైతుల్లో సాగునీటిపై ఆందోళన తప్పేలా లేదు.



చిలుకూరు మండలం బేతవోలుకు వెళ్లే దారిలో ముక్త్యాల బ్రాంచి కెనాల్‌కు పడిన గండి

కాలువ కట్టలపై దృష్టి పెట్టేదెప్పుడు?

ఎడమకాల్వ కట్టలను పటిష్టం చేసే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే ఎడమ, కుడి కాల్వలను తవ్వారు. ఆ తరువాత కొంత కాలానికి కాల్వలకు లైనింగ్ పూర్తి చేశారు. ఏటా కాలువలకు నీటి విడుదల నిలిపివేసిన తరువాత, ఎండాకాలంలో కాలువ కట్టల మరమ్మతులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం వల్ల, కట్టలు బలహీనంగా మారడం, నీటి ప్రవాహం అధికంగా రావడంతో గండ్లు పడుతున్నట్లు సాగునీటి రంగ నిపుణులు భావిస్తున్నారు. గతంలో ఎప్పుడో చేసిన లైనింగ్ కూడా చాలా ప్రాంతాల్లో దెబ్బతినడం, దానికి మరమ్మతు చేయకపోవడంతో కాల్వకు గండ్లు పడుతున్నట్లు చెబుతున్నారు. కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ కాలువలోకి పాలేరు జలాలు వెనుకకు అధిక పీడనంతో రావడం వల్లే గండి పడినట్లు చెబుతున్నారు. మరోవైపు నిడమనూరు మండలం బొక్కమంతులపాడు (బికెపహాడ్) వద్ద కూడా కాల్వ కట్ట బలహీనంగా ఉందని, మిర్యాలగూడ మండల కురియాతండా వద్ద ఎడమకాల్వ లైనింగ్ పూర్తిగా దెబ్బతిందని, అన్నపరెడ్డిగూడెం – వేములపల్లి మధ్య కాలువ లైనింగ్ దెబ్బతిని కట్ట కోతకు గురై గండ్లు పడే ప్రమాదం ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎడమ కాలువ కట్టలపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేపడితేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చు.

స్వచ్ఛవాయు సర్వేక్షణ్‌లో నీలగిరికి రెండవ స్థానం



నల్లగొండ టూటౌన్ : పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కింద నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌కు నీలగిరి మున్సిపాలిటీ ఎంపికైంది. దేశ వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 131 నగరాలు స్వీయ అంచనా నివేదికలు సమర్పించగా వాటిని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) మూల్యాంకనం చేసింది. దాంట్లో జాతీయస్థాయిలో నీలగిరి మున్సిపాలిటీ రెండవ స్థానంలో నిలిచింది. ఈ నెల రాజస్థాన్‌లో జరగనున్న కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు, నగదు అందుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు.

స్వచ్ఛత పనుల్లో ముందంజ..

ఎయిర్ పొల్యూషన్ రాకుండా నీలగిరి మున్సిపల్ యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. పట్టణంలో మీడియం మొక్కలు నాటి సంరక్షించడం, మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడం, ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులను అరికట్టడం వంటి పనులు చేపట్టడంలో నీలగిరి ముందంజలో ఉంది. పట్టణంలో తడి, పొడి చెత్త సేకరించడం, డంపింగ్ యార్డులో రోడ్లు వేయడం, చెత్త కుప్పలతో పర్యావరణం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో నీలగిరి మున్సిపాలిటీ అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. దాంతో స్వచ్ఛ వాయు సర్వేక్షన్ 2024లో నీలగిరి మున్సిపాలిటీ రెండవ స్థానం దక్కించుకుంది.

పంచాయతీల్లో తనిఖీలు

- ప్లాంటేషన్, శానిటేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు
- దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లోని రెండు గ్రామాల్లో పర్యటన



కొండమల్లేపల్లి మండలం కొత్తబాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

నల్లగొండ : గ్రామపంచాయతీల్లో ఆడిట్ బృందాల ఆకస్మిక తనిఖీలు మొదలైయ్యాయి. గ్రామాల్లో ఇప్పటి వరకు పల్లెప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, రోడ్డుకు ఇరువైపుల, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటిన మొక్కలతో పాటు శానిటేషన్‌ను ఆడిట్ బృందాలు పరిశీలిస్తున్నాయి. కలెక్టర్ నారాయణరెడ్డి గతంలోనే చెప్పిన విధంగా మంగళవారం కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాల్లోని రెండు గ్రామాల్లో ఆడిట్ బృందాలు తనిఖీ చేశాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఉరుకుల, పరుగులు పెడుతున్నారు.

రికార్డులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు..

పంచాయతీల్లో గతంలో చేపట్టిన ప్లాంటేషన్, శానిటేషన్‌పై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో రోజూ రెండు పంచాయతీల్లో ఆడిట్ నిర్వహించాలని మండల అభివృద్ధి అధికారులకు కలెక్టర్ ఆదేశాల జారీ చేశారు. మండల ప్రత్యేకాధికారులు మంగళవారం కొండమల్లేపల్లి మండలం కొత్తబాయి, దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గతంలో నిర్వహించిన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేస్తున్నారు. రికార్డులను పరిశీలించి ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లెక్కల్లో చెప్పిన విధంగా మొక్కలు ఉన్నాయా.. లేవా.. మొక్కలు నాటకుండానే రికార్డుల్లో రాశారా అనే విషయాన్ని తెలుసుకున్నారు.. శానిటేషన్ ఏవిధంగా నిర్వహిస్తున్నారు. ఫాగింగ్ చేస్తున్నారా.. బ్లీచింగ్ చల్లుతున్నారా.. రికార్డులకే పరిమితం చేస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు.

కార్యదర్శుల్లో టెన్షన్..

పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ప్లాంటేషన్‌పై తనిఖీలు నిర్వహిస్తుండడంతో కార్యదర్శులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. రోజూ ఉదయం 7 గంటలకే గ్రామాలకు వెళ్తున్నారు. ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేస్తున్నారు. కాగా.. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు కొన్ని చనిపోయాని, కొన్ని మేకలు, పశువులు మేశాయి. ఇలాంటి పరిస్థితిలో రికార్డుల ప్రకారం మొక్కలు లేకపోతే కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో అనే విషయంనూ కార్యదర్శుల్లో టెన్షన్ మొదలైంది.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



చండూరు ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని విద్య, వైద్యంపై ఎక్కువ దృష్టి పెట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చండూరు మున్సిపాలిటీలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు కనీస వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, విద్యుత్, ధరణి తదితర సేవలను సక్రమంగా అందించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎంహెచ్‌ఓ పొట్ల శ్రీనివాస్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ప్రజారోగ్య ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మున్వర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



హాలియాలో ఓటరు జాబితా సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

హాలియా : ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇంటింటి పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ బీఎల్‌ఓను ఆదేశించారు. హాలియా పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్, బొడ్రాయి బజార్‌లో బీఎల్‌ఓలు చేపడుతున్న ఓటరు జాబితా సవరణ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏ వార్డులోకి ఏ ఓటరు వస్తారు? అసెంబ్లీ నియోజకవర్గ నంబర్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు పేరు, హాబిటేషన్ పేరు తదితర వివరాలను సమగ్రంగా సరి చూసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, బీఎల్‌ఓలు అక్బర్, విజయ, నర్మద తదితరులు ఉన్నారు.

పైలెట్ ప్రాజెక్టుతో రైతులకు న్యాయం

- మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో దశాబ్దాల కాలం నుంచి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు తొలగనున్నాయని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండలంలోని నెల్లికల్లు, నాయకునితండాల్లో పర్యటించి గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరును రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సర్వే జరుగుతుండటంతో కొందరు రైతులు కొత్తగా భూములను దున్నుకుంటున్నారని రైతులు వారి దృష్టికి తీసుకురాగా అలాంటి పనులు మానుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు రైతులంతా సహకరిస్తే సర్వే త్వరితగతిన పూర్తి చేయడానికి వీలుంటుందని తెలిపారు. కాస్తు, కబ్జా ప్రకారం సర్వే కొనసాగుతుందని దాని ప్రకారమే పట్టాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, గడ్డం సాగర్‌రెడ్డి, మేరావత్ మునినాయక్, లాలు, శౌరి పాల్గొన్నారు.

ఆక్రమించిన అటవీ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ 1, 2 బ్లాక్‌ల పరిధిలోని కేజేఆర్ కాలనీ, కల్లెపల్లి, వజీరాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ భూములను అటవీ అధికారులు సర్వే చేశారు. గత నెల 31న 'సాక్షి'లో 'అటవీభూముల ఆక్రమణ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. మంగళవారం మిర్యాలగూడ ఎఫ్‌డీఓ నాగభూషణం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణకు గురైన భూములతోపాటు పోడు పట్టాల భూములను సైతం పరిశీలిస్తున్నామని తెలిపారు. అటవీ భూములు ఆక్రమించిన వారిపై ఇప్పటివరకు 15 కేసులు నమోదు చేశామన్నారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌ఓ శేఖర్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ మల్లారెడ్డి, బీట్ ఆఫీసర్లు మల్లేష్‌గౌడ్, మౌనిక తదితరులు ఉన్నారు.



దిలావర్‌పూర్ బ్లాక్‌లో ఆక్రమణకు గురైన ఫారెస్ట్ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

వరద బాధితులను ఆదుకుంటాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



డ్రైయినేజీని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: భారీ వర్షాలకు వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలోని మఠంపల్లి మండలంలో వర్షానికి దెబ్బతిన్న పలు గ్రామాలను మంత్రి సందర్శించారు. చౌటపల్లి వద్ద తెగిన చెరువు కట్ట, కొట్టుకుపోయిన మేళ్లచెరువు–చౌటపల్లి రహదారి, మఠంపల్లి వద్ద తెగిన మామిళ్లచెరువు కట్ట, రఘునాథపాలెం ఊరవాగులో మునిగిన ఇళ్లు, రహదారి, వరదాపురం, చెన్నాయిపాలెం గ్రామాల వద్ద కొట్టుకుపోయిన అలింగాపూర్ రోడ్డు, వేములూరు వాగు వరద నీటలో మునిగిన పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎకరాకు రూ.10వేలు, కూలిన ఇళ్లకు ఇందిరమ్మ ఇల్లు, చనిపోయిన పశువులకు రూ.50 వేలు, మేకలకు రూ.5వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకుంటుందని తెలిపారు. గుండ్లపల్లి ఎత్తిపోతల నుంచి నిత్యం నీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. మఠంపల్లి సమీపంలో రైల్వే లైను కట్టకు ఖానాలు లేకపోవడంతో వరద నీరు దళితుల ఇళ్లలోకి చేరిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మంగా, సీఐ చరమందరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజీనాయక్, నాయకులు కిశోర్‌రెడ్డి, అరుణ, సైదులు, బ్రహ్మారెడ్డి, బాబు, ఎల్లారెడ్డి, సక్రు, రాంరెడ్డి, బుచ్చయ్య, లింగయ్యయాదవ్, దుర్గయ్యగౌడ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈని సస్పెండ్ చేయాలని ఆదేశం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వరద ముంపునకు కారణమైన ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను, ఊరచెరువు తదితర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించి బాధిత ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ సీఈ రమేష్ బాబుతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌ను తప్పుడు ప్రణాళికతో నిర్మించి వరద ముంపునకు కారణమైన ఏఈ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడే ప్లానింగ్ సరిగ్గా లేదని మార్చాలని సూచించానని, అయినా మార్చకుండా అలాగే నిర్మించడంతో నేడు ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని మంత్రి చెప్పారు. చెరువు కట్టకు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఇళ్లలోకి నీరు చేరి నష్టం వాటిల్లిన ప్రతిఒక్కరికి ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుందని, ఇళ్లు పూర్తిగా కూలిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దద్దనాల చెరువు వరద వల్ల ధ్వంసమైన డ్రైయినేజీని పరిశీలించి త్వరగా మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, తహసీల్దార్ నాగేందర్, మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా, పబ్లిక్ హెల్త్ డీఈ రమాదేవి, ఏఈఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

5న నల్లగొండలో జాబ్‌మేళా

నల్లగొండ : నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈనెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు.. పదో తరగతి నుంచి పీజీ వరకు చదిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10.30 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం సాయంత్రం 6227 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు రెండు గేట్లను అడుగు మేర ఎత్తిఉంచి 1,244 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం 642.20 అడుగుల (3.74 టీఎంసీలు) వద్ద నీటిమట్టం ఉంది.

క్లుప్తంగా

పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గరిడేపల్లి: శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గరిడేపల్లి మండల గడ్డిపల్లిలో గల డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నికల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 10వ తరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, దరఖాస్తు ఫారంతో నేరుగా గడ్డిపల్లిలోని కళాశాలలో సమర్పించాలని సూచించారు.

మోహన్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటాం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



మోహన్‌రావు ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చిలుకూరు: మండలంలోని నారాయణపురం గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని ఊర చెరువు కట్ట తెగడంతో కూలిపోయిన మోహన్‌రావు ఇంటిని ఆమె పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మోహన్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ప్రభుత్వం చేయూతనిస్తుందని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే ముందు మోహన్‌రావు కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

బస్సులో గుండెపోటుతో మహిళ మృతి



మృతిచెందిన యాదమ్మ

అర్వపల్లి: గుండెనొప్పితో ఆస్పత్రికి చికిత్స కోసం బస్సులో వెళ్తూ ఓ మహిళ మార్గమధ్యలోనే మృతిచెందింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి అవిలయ్య భార్య యాదమ్మ(60)కు మంగళవారం ఉదయం గుండెనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆర్టీసీ బస్సు ఎక్కించి సూర్యాపేటకు బయలు దేరారు. అర్వపల్లి శివారుకు వచ్చాక గుండెనొప్పి ఎక్కువై బస్సులోనే యాదమ్మ మృతిచెందింది. ఆర్టీసీ బస్సు సిబ్బంది తమ ఉన్నతాధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీపీఆర్ చేసి ఉంటే..


యాదమ్మకు గుండెనొప్పి రాగా కుటుంబీకులు సూర్యాపేటకు చికిత్స కోసం ఆసుపత్రికి బస్సులో తీసుకెళుతున్నారు. ఆమెకు నొప్పి ఎక్కువై ఇబ్బంది పడింది. ఈ సమయంలో ఆమెకు సీపీఆర్ చేసి ఉంటే ప్రాణాలతో బయట పడేదని పలువురు అన్నారు. సీపీఆర్‌పై కుటుంబీకులకు అవగాహన లేకపోవడం, బస్సు వెళుతున్న క్రమంలో ప్రయాణికులు కూడా దృష్టి పెట్టక పోవడం మూలంగా యాదమ్మ ప్రాణాలొదిలింది.

31కిలోల చేప



భారీ చేపతో శ్రీను

అడవిదేవులపల్లి : నాగార్జునసాగర్ ప్రాజెక్టు దిగువన టెయిల్‌పాండ్ నుంచి వరద దిగువకు భారీగా ప్రవహిస్తుండడంతో చేపలు ఒడ్డుకు చేరుతున్నాయి. మంగళవారం సుమారు 31 కిలోల ఒక చేప ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పూజల శ్రీనుకు లభ్యమైంది. ఉదయం కృష్ణానది వరద ఉధృతిని చూసేందుకు శ్రీను రాగా.. అప్పటికే రాళ్ల తాకిడికి దెబ్బతిన్న చేప ఒడ్డుకు చేరింది.



తుంగతుర్తి: మానాపురంలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



మఠంపల్లి మండలం కిందితండా సమీపంలో ఇసుక మేటలతో నిండిన పంటపొలాలు



హుజూర్‌నగర్‌రూరల్: బూరుగడ్డ గ్రామంలో వరద ఉధృతికి పంట పొలాల్లో చేరిన రాళ్లు



మద్దిరాల: పోలుమల్ల శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో వరద నీటితో నిండిన పొలాలు



నడిగూడెం మండలం కాగితరామచంద్రపురం గ్రామ సమీపంలో వరదలకు పంట పొలాల్లో ఇసుకమేటలు

కింది చిత్రంలో కనబడుతున్న వారు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో నివాసముండే మంద ఉపేందర్ దంపతులు. వీరు గత కొన్నేళ్లుగా ఇక్కడే నివాసముంటున్నారు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి వారి ఇంటి పక్కనే ఉన్న ఓ కంపెనీకి చెందిన ప్రహరీ కూలి వీరి ఇంటిపై పడింది. దీంతో ఇల్లు సగం వరకు ధ్వంసమైంది. ఇంట్లో ఉన్న వారికి గాయాలయ్యాయి. మూడు రోజులుగా వారి ఇంటి పక్కన మరో ఇంట్లో ఉంటున్నారు. సామాన్లు అన్నీ ధ్వంసమయ్యాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం కావడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. – సూర్యాపేటటౌన్



ఇంట్లో సామాన్లు బయటకు తీసుకెళ్తున్న మంద ఉపేందర్



పాలకవీడు: వేములూరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన శ్మశానవాటిక



మఠంపల్లి సమీపంలో తెగిన మామిళ్ల చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, నాయకులు



కాగితరామచంద్రాపురం సమీపంలో సాగర్ ఎడమ కాల్వ తెగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు



ఎస్కేప్ ఛానల్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితారెడ్డి



డిండి: దిండి వాగులో చిక్కుకుని సురక్షితంగా బయటకు వచ్చిన చెంచులతో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పోలీసులు, నాయకులు



వేములపల్లి మండలం అన్నపరెడ్డిగూడెం ఎల్‌-11 తూము వద్ద ఎడమ కాల్వ కట్ట పరిస్థితి ఇది..



నిడమనూరు మండలం ముప్పారం సమీపంలో బలహీనంగా ఉన్న ఎడమ కాల్వ కట్ట



గరిడేపల్లి: వెలిదండ వద్ద కోతకు గురైన సాగర్ ఎడమ కాల్వ కట్ట



మిర్యాలగూడ మండలం కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ లైనింగ్



వేములపల్లి మండలం అన్నపరెడ్డిగూడెం ఎల్‌-12 తూము వద్ద కోతకు గురైన ఎడమ కాల్వ



నిడమనూరు మండలంలోని ముప్పారం బ్రిడ్జి సమీపంలో ప్రమాదకరంగా సాగర్ ఎడమ కాల్వ కట్ట

దెబ్బతిన్న రోడ్లు, వంతెన

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్ట రెండు చోట్ల తెగడంతో ప్రవహించిన వరద నీటికి రైతుల పొలాలకు వెళ్లే రహదారులు పలు చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు 50కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అదేవిధంగా కాగితరామచంద్రాపురం నుంచి ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన మందడినర్సయ్యగూడెం వద్ద ఉన్న వంతెన దెబ్బతింది. దీంతో ప్రజల రాకపోకలు నిలిచాయి. సంబంధిత అధికారులు వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న సూర్యాపేట-ఖమ్మం జిల్లాల సరిహద్దు వంతెన

తహసీల్ కార్యాలయ స్థలం వేలానికి కోర్టు ఉత్తర్వులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలోని వంద గజాల ఖాళీ స్థలాన్ని బహిరంగ వేలంలో విక్రయించుటకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జట్టా శ్యాంకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్‌నగర్ మండలంలోని వేపల సింగారం గ్రామానికి మూడెల రాయపురెడ్డి, చెక్కెర రోషమ్మకు చెందిన ఆ భూమిని 1985లో అప్పటి ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల నిర్మించేందుకు సేకరించింది. అప్పట్లో ఎకరం రూ.10వేల చొప్పున ధర నిర్ణయించగా.. దానిని వ్యతిరేకిస్తూ సదరు రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఎకరానికి రూ.17,500 నష్టపరిహారంతో పాటు వడ్డీ కలిపి చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హుజూర్‌నగర్ తహసీల్దార్ హైకోర్టులో అప్పీల్ చేయగా హైకోర్టు అప్పీల్‌ను కొట్టివేసింది. తమకు రావలసిన పరిహారం కోసం రైతులు కోర్టు ఆశ్రయించగా.. తహసీల్దార్ కార్యాలయంలోని 100గజాల ఖాళీ స్థలాన్ని బహిరంగ వేలంలో విక్రయించేందుకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

జోలె కట్టి ప్రాణాలు కాపాడారు



కుటుంబరావును జోలెలో కూర్చోబెట్టి బంధం వాగు దాటిస్తున్న యువకులు

- తేలు కుట్టిన వ్యక్తిని బంధం వాగు దాటించిన యువకులు

తుంగతుర్తి: తేలు కుట్టి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని గ్రామస్తులు జోలె కట్టి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. తుంగతుర్తి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన పడిశాల కుటుంబరావు మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలో వరద నీటికి తెగిన వరాలకు గండ్లు కట్టడానికి వెళ్లాడు. గండ్లు కడుతుండగా అతడిని తేలు కుట్టింది. విషయాన్ని గ్రామస్తులకు ఫోన్ చేసి చెప్పగా.. గ్రామానికి చెందిన యువకులు పొలం దగ్గరకు వెళ్లి కుటుంబరావును ఆస్పత్రికి తీసుకెళ్లేందుంకు ప్రయత్నించగా.. కేశవాపురం–వెలుగుపల్లి మధ్యలో బంధం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో యువకులు జోలె కట్టి కుటుంబరావును వాగును దాటించారు. వెలుగుపల్లి నుంచి ఆటోలో తుంగతుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబరావు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పాలేరు వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

- రెండు వైపులా వెళ్లే వాహనాలను ఒకే రూట్‌లో పంపిస్తున్న అధికారులు



పాలేరు వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

కోదాడ రూరల్ : తెలంగాణ, ఏపీ సరిహద్దులోని హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పాలేరు వాగు వంతెనపై అధికారులు రాకపోకలను పునరుద్ధరించారు. సోమవారం ఉదయం వంతెన తెగిపోవడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. అయితే, వాగు ఉధృతి తగ్గడంతో సోమవారం రాత్రి నుంచి కొత్త బ్రిడ్జిపై నుంచి వాహనాలను అనుమతించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను, విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను ఒకే రూట్‌లో పంపిస్తున్నారు. వాహనాలు ఒకే మార్గంలో వస్తూ హైదరాబాద్ వైపు వచ్చేవి రామాపురం క్రాస్‌రోడ్ వద్ద, విజయవాడ వైపు వెళ్లేవి గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద దారిమళ్లి రెండు మార్గాల్లో యాధావిధిగా ప్రయాణిస్తున్నాయి. ఏపీ వైపు 20 మీటర్ల మేర కోతకు గురైన పాత బ్రిడ్జి పనులను అధికారులు ప్రారంభించారు. మరో రెండు రోజుల్లో ఆ పనులను పూర్తి చేసి వాహనాలను అనుమతించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మొన్న అలా..



నేడు ఇలా..



కోదాడ పట్టణ పరిధిలోని పెద్దచెరువు వరదకు శనివారం షిర్డిసాయినగర్ మునిగిపోవడంతో పడవల ద్వారా స్థానికులను ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంగళవారం వరద తగ్గడంతో షిర్డిసాయినగర్‌లోని ఇళ్లు నీటి నుంచి బయటపడ్డాయి. – కోదాడ